# నీ ఋణం తీర్చుకున్నా!

(భారతి : అక్టోబరు - 1926)

**సూ**ర్యనారాయణ భోజనం ముందర కూర్చున్నాడు. మీనాక్షి నేతిగిన్నె పుచ్చుకొని వంటయింటి ద్వారబంధం దగ్గర నుంచుంది. సూర్యనారాయణ పరిషేచనం చెయ్యబోతూ "కృష్ణమూర్తి యేడే" అన్నాడు. కృష్ణమూర్తి దొడ్డి గడపలోంచి తొంగిచూశాడు. సూర్యనారాయణ నవ్వి 'రా! నాయనా! బువ్వ తిందువుగాని రా' అన్నాడు. కృష్ణమూర్తి సందేహించాడు.

**సూ** : రా, దొంగబూచి!

కృష్ణమూర్తి మొగము తలుపుచాటున పెట్టి, మొగం చూపించి వోరగా నవ్వాడు.

**సూ** : రా, నాయనా! రా! (భార్యతో) తీసుకురావే నువ్వు

మీనాక్షి కృష్ణమూర్తిని ఎత్తుకొని వచ్చి సూర్యనారాయణ దగ్గర కూర్చోపెట్టి వెండి గిన్నెలో అతనికి వేటే కలిపి పెట్టింది.

**సూ** : నెయ్యివేసి కలిపి నోట్లో పెట్టనా ?

**కృష్ణ** : నే తీతుకు తింతా

**మీనాక్షి** : " నువ్వే తీతుకు తిను" అని కుఱ్ఱవాణ్ణి ముద్దెట్టుకుంది. భోజనం చేసినంతసేపూ అన్నీ కృష్ణమూర్తికి ముందు, అతని యిష్టం వచ్చినట్లూ

భోజనం అయిపోయిన తరువాత సూర్యనారాయణ సావిట్లో కూర్చొని "ఏమోయి కృష్ణమూర్తి! తాంబూలం వేసుకుంటావా?" అన్నాడు.

కృష్ణమూర్తి "ఊ! వేసుకుంటానూ" అని దీర్ఘం తీశాడు.

సూర్యనారాయణ వక్క కొఱికి సగం అతని నోట్లోపెట్టి తమలపాకుకు సున్నం రాచి అందిస్తూ "నీ పేరేమిటీ" అన్నాడు.

**కృష్ణ** : కిత్తమూతి

**సూర్య** : మీ నాన్నపేరు?

**కృష్ణ** : వేంక తే తల్లావుగాలు

**సూర్య** : మీ అమ్మపేరో?

**కృష్ణ** : అనతూయ

సూర్యనారాయణ 'అల్లాగటోయి' అని సంతోషించినాడు. ఈ రీతిగా ఆ కుఱ్ఱవాడి చేత పేర్లు చెప్పించడం, సంతోషించడం రోజుకు పదిసార్లు. అది ఎప్పటికప్పుడే కొత్త.

ఇంతలో భోంచేసి వేంకటేశ్వరరావు వచ్చి కొడుకును చూచి 'ఎక్కడ అన్నం తిన్నావురా!' అన్నాడు.

**కృష్ణ** : వీల్లింతో

**వేంక** : వాళ్ళింట్లో భోంచేస్తారా?

కృష్ణమూర్తి "ఏం భోంచేత్తే" అన్నాడు కనుబొమ్మలెత్తి ముఖం అడ్డంగా తిప్పుకొని

**వేంక** : అమ్మ కొడుతుంది ఉండు.

**సూర్య** : "ఎందుకు కొడుతుంది" అను.

**కృష్ణ** :"ఎందుకు కొల్తుందేమితి? కొత్తే మల్లీ కొల్తాను.

ముగ్గురు కలిసి నవ్వారు. వేంకటేశ్వరరావు, సూర్యనారాయణరావు బందరులో ఇద్దరూ ఒకింట్లోనే అద్దెకి వుంటున్నారు. వేంకటేశ్వరరావు కలెక్టరాఫీసులో గుమాస్తా. సూర్యనారాయణ హైస్కూల్లో మాస్టరు.

సూర్యనారాయణకు బిడ్డలు లేరు. వేంకటేశ్వరరావున కిత డొక్కడే కొడుకు. ఇద్దరూ ఒకటయితే నేం యిటైతే నేం సుమారు ముప్ఫయి యేళ్ళవాళ్ళు. సూర్యనారాయణ భార్య కాపరానికి వచ్చి యెనిమిదేళ్ళవుతుంది. బిడ్డలు లేరు. అందుచేత ఆ భార్యాభర్త లిద్దరికీ కృష్ణమూర్తి మీద అతి ఆపేక్ష. కృష్ణమూర్తి యెంత యేడుస్తున్నా సూర్యనారాయణ ఎత్తుకుంటే మానేస్తాడు. కృష్ణమూర్తి పగలల్లా సూర్యనారాయణగారి యింట్లోనే వుంటాడు.

కడుపున పుట్టిన బిడ్డ, బంగారు బొమ్మ, ముద్దుమాటలకు ముత్యాల గొడుగు; కృష్ణమూర్తి అంటే తల్లిదండ్రులకు అమితప్రేమ. వేంకటేశ్వరరావు కన్న సూర్యనారాయణ ధనవంతుడు. వేంకటేశ్వరరావునకు ఉద్యోగమే ఆధారము.

సూర్యనారాయణకు తెనాలి వైపున పాతిక యెకరాల సుక్షు మాగాని పొలముంది. అనసూయకన్న మీనాక్షి అందగత్తె. చదువుకుంది. సూర్యనారాయణ విద్యాధికుడు. బి.ఏ.ఎల్.టి...ఎం.ఏ.కు చదువుచున్నాడు. వేంకటేశ్వరరావు స్కూల్ ఫైనల్ ప్యాసయినాడు. మీనాక్షికి సూర్యనారాయణకి సంతానం లేదు. వాళ్ళకి కృష్ణమూర్తిని చూస్తే తమ బిడ్డే అనిపించింది. ఏ జన్మాంతరవాసనో, మీనాక్షి సూర్యనారాయణలు పండుకొని బిడ్డను మధ్య పడుకోబెట్టుకొని మాటలు చెప్పించుకొని నవ్వుకుంటారు. సంతోషపడతారు. అతనికి ఉక్కిరిబిక్కిరయ్యేటట్టుగా కౌగలించుకొని ముద్దుబెట్టుకుంటారు. కొడుకు కోసం అనసూయ వస్తే మీనాక్షి లేచి అబ్బాయిని తల్లికిస్తుంది.

కృష్ణమూర్తికి మూడేళ్ళు వెళ్ళినై, ఎడపిల్ల లేదు గనుక పాలు తాగుతూనే వున్నాడు.

సంవత్సరాది పండుగ వస్తే సూర్యనారాయణ కృష్ణమూర్తికి మూడు కాసులు పెట్టి మెడలోకి సన్నని బంగారు గడియారపు గొలుసు చేయించాడు. మీనాక్షి వూలుతో రుమాలు అల్లి కుళ్ళువాడికి కప్పింది. పండుగనాడు మీనాక్షి కుర్రవాణ్ణి అలంకరించి కృష్ణమూర్తి వేషం వేసింది. నెత్తిమీద నెమలికన్నులు, మొగాన నల్లని నిలువు బొట్టు, పునుగుతో. సూర్యనారాయణ ఎత్తుకొని బజారు వెళ్ళాడు. అందరూ పిల్లవాణ్ణి కళ్ళార చూచినవాళ్ళే. మళ్ళీ ఇంటికి వచ్చేటప్పటికి పిల్లవాడికి ఆర్చి దిష్టికొట్టింది. కుర్రవాడు రెండురోజులు లేవలేదు.

మీనాక్షి సూర్యనారాయణలు అమితంగా నొచ్చుకున్నారు. కృష్ణమూర్తి తల్లిదండ్రులను మఱచిపోయినాడు. సూర్యనారాయణ కృష్ణమూర్తికి కొన్ని వస్తువులు ఖరీదు చేస్తే రెండు వందల రూపాయలకు పైన అవుతై. అనసూయా వేంకటేశ్వరులు వద్దనలేరు. కద్దనలేరు. వాళ్ళకీ తమ బిడ్డ యితర వాళ్ళ చేత యింత ముద్దుగా చూడబడటం యిష్టంగానే వుంది.

వేసవికాలం వచ్చింది. పగలు ఎండలకి గాడ్పులు సుళ్ళు తిరిగినా సముద్రతీరము గనుక సాయంకాల మవటంతోటే చల్లబడుతుంది.

కృష్ణమూర్తికి చందన చర్చలు, పన్నీటిపూతలు, మల్లెపూదండలు, మామిడిపళ్ళ షర్బతులు, ఒళ్ళంతా గంధం పూసి పక్కమీద మల్లెపూలు చల్లి కుర్రాణ్ణి పడుకోబెట్టి, మీనాక్షి విసురుతుంది.

ఇంట్లో పిల్లి మూతలు పడేస్తుందని ఆమె కొంత లోపలికి వెళ్ళినా, కృష్ణమూర్తి ఎండలోకి పరుగెత్తుతాడు. ఆవిడ వచ్చి ఇతడిని వెదకి మళ్ళీ శుశ్రూష.

ఒకరోజున సాయంత్రం దొడ్లో కొబ్బరి చెట్టుక్రింద పిల్లాడు ఆడుకుంటున్నాడు. ఎక్కడిదో గేదె వచ్చి తొక్కేదయింది. అనసూయ లేవనేలేదు. మీనాక్షి ఎంతో ఆదుర్దాతో లేచి వెళ్ళి పిల్లవాణ్ణి చప్పున ఎత్తుకుంది. వాడు కిలకిలా నవ్వాడు.

అనసూయ అందిగదా "పరవాలేదమ్మా అక్కయ్యా" అని. అని మళ్ళీ అంది "ఏమమ్మా! అక్కా! నీ కడుపున ఒక కొడుకు పుడితే మా అబ్బాయి మీద నీకింత ప్రేమ ఉంటుందా?"

**మీనాక్షి** : నాకు బిడ్డ లెందుకులే! కృష్ణమూర్తిని నీవు నాకిచ్చేద్దూ? (కృష్ణమూర్తితో)

నాయనా! నీవు నాదగ్గఱ ఉంటావా! మీ అమ్మదగ్గరికి వెళతావా!

**కృష్ణ** : నీదగ్గిలే ఉంతా!

సూర్యనారాయణకు వేసవికాలపు సెలవులు వచ్చాయి. వాళ్ళ ఊరు గుడివాడ సీమలో ఒక పల్లెటూరు. అక్కడ సూర్యనారాయణకు ఒక కొబ్బరితోట, మామిడితోట ఉన్నాయి. అందులో చల్లగా ఉంటుంది. వేసవి సెలవులు సామాన్యంగా అతనికి అక్కడ గడుస్తవి. సెలవులు శుక్రవారం నాడిచ్చారు. శని, ఆది వుండి సోమవారం పోదామనుకున్నారు భార్యాభర్తలిద్దరూ. కుర్రవాణ్ణి వదలిపెట్టలేకపోయినారు. తేపంటే తేపని వారం రోజులు గడిచినై. వేంకటేశ్వరరావుకి ఉద్యోగంగా అది యమలోకం. సర్వీసు పోష్టాఫీసుది. అతనికి సెలవులు లేవు. తమవూరు వెడదామన్నా.

మీనాక్షి కుర్రవాణ్ణి తీసుకువెళదామన్నది. భర్త "వాళ్ళు పంపిస్తారా?" అన్నాడు. నాలుగు రోజులు ఈ మథనపడ్డారు.

చిట్టచివరకు కుఱ్ఱవాణ్ణి తీసుకువెళ్ళటం ధ్రువం చేశారు. అనసూయ వేంకటేశ్వరరావులు మొట్టమొదట నాలుగైదు రోజులు వద్దన్న వాళ్ళు ఇప్పుడు ఏమీ అనలేక వూరుకున్నారు. ఊరుకోటం యిష్టం వుండి కాదు. ఏమీ అనలేక. అర్ధాంగీకారం దానికి సమన్వయించారు మీనాక్షి సూర్యనారాయణలు.

కుఱ్ఱవాణ్ణి "మాతో వస్తావా నాయనా?"అంటే "వత్తాను" అని "వుంటావా తండ్రీ" అంటే "వుంతాను" అని ఎన్నిసార్లడిగినా ఇట్లాగే చెబుతాడు.

"అక్కయ్యా! కుఱ్ఱవాడు జాగ్రత్త" అని ఒక వందసార్లు చెప్పింది అనసూయ. వేంకటేశ్వరరావు రైలుదాకా వెళ్ళి రైలు కదలిన తరువాత యింటికి వచ్చాడు.

నందమూరు ఆడవాళ్ళొతిగి పోయినారు. పిల్లణ్ణి చూసేందుకు, అందులో పల్లెటూరాయెను. పల్లెటూళ్ళలో ఉద్యోగస్థులంటే చాలా గౌరవం; మాష్టరంటే అంత గౌరవం లేదు కాని సూర్యనారాయణకు నూఱురూపాయల జీతం కనుక అది కొంతమట్టుకు ఫరవాలేదు.

కుఱ్ఱవాడికి మళ్ళీ దిష్టికొట్టింది. మఱునాడు జ్వరం వచ్చింది. మూడవరోజున తగ్గింది. కుర్రవాడు "అమ్మేది" అన్నాడు ఆ రోజున. మళ్ళీ మఱచిపోయినాడు. నీళ్ళు మాఱటం వల్లా కొబ్బరికాయల యెడ నీరు తాగడం వల్లా, అయిదోనాడు కుర్రవాడికి జలుబు చేసింది. పూజారి వెంకయ్యను పిలిచి చూపించారు. అతను ఏమీ లేదని ఒక మాత్ర యిచ్చిపోయినాడు. మానికొండ నుంచి సాయిబులు మామిడికాయలు అమ్మొస్తారు. నాజూకు బదన్ బద్దలుకోసి ముక్కలు పెట్టారు. కుఱ్ఱాడికి, జలుబుమీద దారుణం చేసింది. పదిరోజుల్లో పిల్లాడికేం బాగుండలేదు. మీనాక్షి తొందరపడ్డది. పిల్లాడిని తీసుకుపోదాం పదండి అంది. ఆ రోజున నవమి, శనివారం. ఏదో నివేశస్థలాన్ని గుఱించి కొంచెం తగాదా వుంటే "తేపు వెళదాం" అన్నాడు సూర్యనారాయణ. మర్నాడూ వీల్లేకపోయింది. ఆదివారం నాడు రాత్రి పిల్లవాడికి జ్వరం ఎక్కువగా వచ్చింది. రాత్రి నిద్దర్లో లేచి "అమ్మా నాన్నా ఏలీ? తీతుకులా?" అని యేడిచాడు. "నాయనా! ప్రొద్దున్నే వెళదాం" అని వోదార్చింది మీనాక్షి. భార్యభర్తలు ఇద్దరూ తెల్లవారులు మేలుకొనే వున్నారు.

మఱునాడు ఏకాదశి, సోమవారం. కుర్రవాడు తీసుకు వెళ్ళే స్థితిలో లేడు. సూర్యనారాయణ వేంకటేశ్వరరావుకి టెలిగ్రాము కొట్టాడు. మీనాక్షి కన్నీరు మున్నీరుగా ఏడుస్తోంది. తొందరపడుతుంది. ఏడుపు ఆపుకుంటుంది. పిల్లవాణ్ణి మాటిమాటికి ఏమిటో పలుకరిస్తుంది. కుఱ్ఱవాడికి సకలవిధ శుశ్రూషలు చేస్తుంది. వైద్యుణ్ణి యింటికి వెళ్ళనియ్యక ఆ రాత్రంతా మందులు పోస్తూనే వున్నారు. సూర్యనారాయణ నిస్తబ్దుడై పోయినాడు. ఈ అప్రతిష్ఠ ఎల్లాగా అనుకున్నాడు. అతని ఒంట్లోంచి ప్రాణాలు లేచిపోయినై.

కుఱ్ఱవాడు మీనాక్షి కౌగిట్లోనే చంద్రాస్తమానం వేళకు చనిపోయినాడు. మఱునాడు తెల్లవారింది.

పదిగంటలైంది. వేంకటేశ్వరరావు రైలు మీద రాలేదు. మీనాక్షికి స్మృతి తెలియదు. వీధి అరుగు మీద సూర్యనారాయణ శవం వలె కూర్చుని సందుతిరిగి యెవళ్ళు వస్తున్నా వెంకటేశ్వరరావేమో నని చూస్తున్నాడు. వేంకటేశ్వరరావు రాలేదు.

"ఇక చూచి మాత్రం ఏం లాభం? సాయంత్రం రైలు మీద వస్తాడేమో, ప్రొద్దు కూకుతోంది. అందాకా రాత్రి పోయిన పిల్లవాడిని యింట్లో పెట్టుకు కూర్చుంటామా?" అని సూర్యనారాయణ బంధువులు పిల్లవాణ్ణి తీసుకువెళ్ళి పాఱవేసి వచ్చారు. పిల్లవాడిని తీసుకు వెడుతోంటే మీనాక్షి ఊరిబయట దాకా బిగ్గరగా ఏడుస్తూ వెళ్ళింది. అక్కడనుండి ఆవిణ్ణి బలవంతాన తీసుకువచ్చారు.

రోజల్లా మీనాక్షీ సూర్యనారాయణలు భోజనమే చేయలేదు. ఆనాడు అతి తీక్షణంగా ఎండకాసింది. వడ బాగా కొట్టింది. ప్రొద్దు కూకేటప్పటికి అనసూయా వేంకటేశ్వరరావులు వచ్చారు.

ప్రొద్దుటినుంచీ సూర్యనారాయణ వీధి అరుగు మీద కూర్చున్నవాడు కూర్చున్నట్లే వున్నాడు. అతని ముఖం మహాదుఃఖం చేత, అప్రతిష్ట భయం చేత ఎండిపోయింది. దయ్యం ముఖం బడ్డది.

వేంకటేశ్వరరావు కనబడ్డంతోటే సూర్యనారాయణ ఆవురమని యేడ్చి వెనక్కు విఱుచుకుపడ్డాడు. ఇంట్లో నుంచి ఏడుస్తూ వచ్చి మీనాక్షి అనసూయ కాళ్ళమీద పడ్డది.

"రససిద్ధులైన మహాకవులు వర్ణించే యిట్టిపట్టు" నే నెవడును వర్ణించుటకు? ఆ నిమేషములు ప్రళయకాండములు!

ఆ నలుగురూ బతుకుతారని యెవరూ అనుకోలేదు. వాళ్లని ఓదార్చడం ఎవరిచేతా కాలేదు. మీనాక్షీ సూర్యనారాయణలకు అనసూయా వెంకటేశ్వరులను మొగాలలో చూడ భయం వేసింది.

చివరకు వేంకటేశ్వరరావు ఏడుస్తూ "నా బిడ్డని నేను చూడకుండా ఎందుకు పారేశావు? నువ్వెవడవు. నా బిడ్డను పారేశేందుకు? నా బిడ్డడు.

నేను చేతులారా తీసుకువెళ్ళి పారేసుకునేవాణ్ణి. అయ్యో! తండ్రీ!" అని కోపమో దుఃఖమో తెలియకుండా అన్నాడు.

వేంకటేశ్వరరావు "దుర్మార్గుడా! యముడివి నువ్వు. నా కుఱ్ఱాణ్ణి నాకు తే. నా బంగారు తండ్రిని నాకు తే. మా అయ్యని నాకు ఇయ్యి. ఆ చచ్చిపోయిన శవాన్నే నాకిచ్చేసేయి. నేను తీసుకువెళ్ళి పారేసుకుంటా. నా తండ్రిని ఇయ్యి. ఇయ్యి". అని ఇంకా అంటూ వుండగా సూర్యనారాయణ కళ్ళనిండా నీళ్ళు కారుతోంటే గద్గదస్వరంతో రెండుచేతులూ పైకెత్తి దణ్ణం పెట్టి "నాయనా! తప్పుచేశా! నీ ఋణం తీర్చుకుంటా! తీర్చుకుంటా! క్షమించు" అన్నాడు.

అనసూయ యేడుస్తూ వచ్చి, భర్త నోరు మూసి "ఊరుకోండి, వాడి కాయుర్దాయం లేకపోతే వాళ్ళేం చేస్తారు?" అన్నది. మీనాక్షి సూర్యనారాయణలకు అప్పుడు చచ్చిపోతే బాగుండు ననిపించింది. భగవంతుడిచ్చిన ఆయుర్దాయం తగ్గించుకునేందుకు మాత్రం వాళ్ళెవళ్ళు?

వేంకటేశ్వరరావుకి మళ్ళీ శోకప్రవాహం పొంగి వచ్చింది. "ఇదుగో నయ్యోయి! సూర్యనారాయణా! నీవు చదువుకున్నవాడవు. ధనవంతుడివి. నా పిల్లాణ్ణి దాయక ఇచ్చేశేయి. ఇచ్చేశేయి. అయ్యో! వాడు రత్నాల మూటయ్యా! మళ్ళీ అటువంటి బిడ్డను చూడలేనయ్యా! అయ్యో! తండ్రీ! నీవు చచ్చిపోయినావంటే నమ్మలేకుండా వున్నానురా! చచ్చిపోలే! అబద్ధం చెబుతున్నాడు. ఇదుగో నయ్యోయి! నా బంగారపు తండ్రిని నాకు తే! చచ్చిపోయినవాణ్ణి ఇవ్వవయ్యా! నేను పాతిపెట్టుకుంటా, వాళ్ళదుంపతెగ నిన్న సెలవియ్యలేదయ్యా! నాతండ్రిని చూశేవాణ్ణేమో!" అని మళ్ళీ యేడుస్తూ, "నిజంగా నా తండ్రి పోయినాడా? ఆ కళ్ళు–అవ్వి; వాడు చచ్చిపోతాట్టయ్యా! పోతే పోయినాడు; కళ్ళని చూచుకుంటా; నాబిడ్డని నాకియ్యి!"

పక్కని ఏడుస్తున్న పొరుగమ్మ ఓదారుద్దామని "నాయనా! చచ్చిపోయిన బిడ్డని యేం చేస్తావు?" అన్నది.

**వేంకటేశ్వరరావు** : ఏంచేస్తానా! చేతుల్తో పారేసుకుంటా! ఎదురొమ్మున అదుముకుంటా. ఆ చల్లని పెదవులు ముద్దెట్టుకుంటా. నా బిడ్డని నేను పారేసుకోవాలి గాని, ఈయన యెవరు పారేసేందుకు?"

సూర్యనారాయణ ఒకే విధంగా ఏడుస్తున్నాడు. మీనాక్షికి స్మృతివుందో లేదో!

చివరికి వుండమంటోంటే వుండకుండా ఆ రాత్రే ప్రయాణం అయి అనసూయా వేంకటేశ్వరరావులు వెళ్ళిపోయినారు. శ్మశానం దగ్గరకు వెళ్ళేటప్పటికి సందె చీకటి. అక్కడ రెండు కుక్కలు తిరుగుతున్నాయి. భార్యాభర్తలు యిద్దరూ అక్కడ కాసేపు కూర్చుని యేడిచారు. ఊరి మునసబు వాళ్ళను రైలు దగ్గరికి తీసుకెళ్ళేందుకు తన పాలేరును పంపించాడు. ఇందుపల్లి స్టేషను అక్కడికి రెండు మైళ్ళుంది. ఆ శోకమూర్తులు స్టేషన్‌లోకి వెళ్ళారు. రైలు వచ్చింది.

సూర్యనారాయణ ఏదో తప్పుచేశాననుకొన్నాడు. మీనాక్షి దుఃఖం చెప్పేందుకు వీలులేదు. వాళ్ళిద్దరికి నిద్రాహారాలు లేవు. సూర్యనారాయణ నెలరోజులైన తర్వాత బయటికి వచ్చాడు. చిక్కి శల్యమైనాడు. మీనాక్షికి నిరంతరశోకం చేత కళ్ళు జబ్బు చేసినై. రెండు నెలలైంది. కళ్ళు ఎక్కువ చేసినై. సెలవులు అయిపోయినై. సూర్యనారాయణ ఉద్యోగానికి రిజిగ్నేషన్ ఇచ్చాడు. "మళ్ళీ బందరు ఏ మొగం పెట్టుకు వెళ్లను" అని ఏడిచాడు. కుఱ్ఱవాని నగలన్నీ ఇన్సూర్ చేసి, వేంకటేశ్వరరావుకి పంపించాడు. వేంకటేశ్వరరావు తిరగగొట్టినాడు. అట్లాగే ముడుపులల్లే పెట్టెలో వున్నాయి.

వేంకటేశ్వరరావుకి సూర్యనారాయణకి విరోధం వచ్చిందా అన్నట్లు వుంది. వేంకటేశ్వరరావు పేరుచెబితే యితనికి భయం. సూర్యనారాయణ క్రాఫింగు పోయింది. తెల్లబట్టలు, కోట్లు, అన్నీ సన్నగిల్లినై. గోష్పాదం అంత జుట్టు, తెల్లవారుకడనే కోడి కుయ్యడం తోటే లేస్తాడు. రెండు జాములయ్యే వఱకు అనుష్ఠానం. నెలకు పదిహేను రూపాయలిచ్చి ఒక బ్రాహ్మణ్ణి పిలిపించి నమక చమకాలు, శ్రీసూక్తం, పురుషసూక్తం, నాలుగు పనసలు చెప్పించుకుంటాడు. రతీమన్మథులవలె ఉండే మీనాక్షీ సూర్యనారాయణు లిపుడెట్లున్నారు? మీనాక్షి అందం పోయింది. సూర్యనారాయణ ఉత్సాహం పోయింది. వాళ్ళకి మునుపటి ఆరోగ్యం లేదు.

కాలం పరుగెడుతోంది. రెండు సంవత్సరాలైంది. వేంకటేశ్వరరావుకి ఒక కూతురు పుట్టింది. వాళ్ళశోకం ఆ పిల్ల శిశుక్రీడల్లో చల్లారిపోయింది.

మూడు సంవత్సరములు గడచినై. పెద్ద గాలివాన వచ్చింది. సూర్యనారాయణ మామిడితోట, కొబ్బరితోట పాడైపోయినవి. సరిగా తోటలకు నీళ్ళు తోడించకపోవడం చేత వాని మీద ఫలసాయం ఏమీ రావటం లేదు. సూర్యనారాయణ పొలాలు చేసే రైతులు మక్తాధాన్యం సరిగా కొలువక, మాకక్కరలేదని భూమి వదలిపెట్టి, ఇంకెవ్వరినీ కుదరనివ్వక, పల్లెటూళ్ళలో డబ్బుగల రైతులు భూమిగల బ్రాహ్మణులను ఎన్ని చిక్కులు పెట్తారో అన్నీ పెట్టున్నారు. ఇంకా అనేక కారణాల చేత సూర్యనారాయణకు మళ్ళీ ఉద్యోగం చేస్తే బాగుండు ననిపించింది. ఉన్న ఊరు గదా అని బందరు స్కూల్లోనే పెట్టాడు. వేణే ఎక్కడో వున్నాడు. ఒకరోజున సాయంత్రం వేంకటేశ్వరరావూ, సూర్యనారాయణా బజార్లో కలుసుకున్నారు. సూర్యనారాయణ మొగం వాల్చుకున్నాడు. వేంకటేశ్వరరావు పలుకరించి ఏదో మాట్లాడి "మా అమ్మాయిని చూచిపోదురు గారి ణేపెప్పుడైనా రండి" అని చెప్పాడు. "వదినెగారు వచ్చిందా" అని అడిగాడు. అవ్వాళ రాత్రి వేంకటేశ్వరరావు సూర్యనారాయణ కనపడ్డాడని భార్యతో చెప్పాడు. "వూళ్ళో మళ్లీ మాస్టరు చేస్తున్నాట్ట. ఆ పేటలో ఉన్నాట్ట. మీనాక్షమ్మగారితోనే వచ్చాట్ట" అని.

అనసూయకు మీనాక్షిని చూద్దామనిపించింది. వాళ్ళెక్కడున్నారో కనుక్కుని నాల్గురోజు లైం తరువాత చూట్టానికెళ్ళింది. ఇద్దరూ కొంచెం కంట తడిపెట్టుకున్నారు. బాగానే మాట్లాడారు.

మాటల సందర్భంలో మీనాక్షికి ఏడో నెల అని తెలిసింది.

అనసూయ వెళ్ళిపోయేటప్పుడు "మా రెండో భాగంలో ఎవళ్ళో అరవ వాళ్ళున్నారు. మాటాలేదు. ముచ్చటా లేదు. వట్టి అనాచారంగా ఉంది. ట్రాన్సుర్ అయిందట. వెడతారు. మీరు వచ్చి వుండండమ్మా అక్కయ్యా" అని చెప్పింది.

మీనాక్షిని పుట్టింటివారు తీసుకువెళ్ళారు. సూర్యనారాయణ ఆరునెల్లో ఏడునెల్లో హోటల్లో ఉన్నాడు. వేంకటేశ్వరరావు కూతురు పుట్టినరోజు పండుగచేసి సూర్యనారాయణని భోజనానికి పిలిచాడు. ఆయస వెళ్ళాడు. భోజనం చేసినంతసేపు తలవంచుకునే కూర్చున్నాడు. పాపం. మళ్ళీ వాళ్ళిద్దరికి స్నేహం కుదిరింది.

"పోయినవాడు పోయినాడు. లేనిపోని విరోధాలెందుకు? వాళ్ళు మాత్రం చంపాలని చంపారా? పాపం వాడంటే వాళ్ళెంత ప్రేమగా చూచారు? నిజంగా పడితే వాడు వాళ్ళ బిడ్డే. మన బిడ్డ కానేకాడు" అని అనుకున్నారు అనసూయా వేంకటేశ్వరులు.

సూర్యనారాయణకి జ్వరం వచ్చింది. హోటలులో పథ్యం, పానం సరిగ్గా జరగలేదు. వేంకటేశ్వరరావు బలవంతం మీద అతన్ని యింటికి తీసుకువచ్చాడు. నాలుగురోజులున్నాడు.

పురుడు పుణ్యం వెళ్ళింది. మీనాక్షిని తీసుకురావాలి. మునుపటి యిల్లు వదలి పెట్టారు. మళ్ళీ యెక్కడా కుదరలేదు. చివరకు వేంకటేశ్వరరావు బలవంతం మీద వేంకటేశ్వరరావు యింట్లోనే రెండో భాగంలో ఉండేట్టు నిర్ణయించారు.

మీనాక్షికి మగపిల్లవాడు మూదుమూర్తులా కృష్ణమూర్తే. మీనాక్షి మనసులో అనుకుంది పైకి అనలేదు. మీనాక్షీ సూర్యనారాయణలు తమ కుర్రవాడితో కూడ వచ్చి ఆ యింట్లో కాపురమున్నారు. సంవత్సరం గడచింది. రెండేళ్ళు గడచినై.

పిల్లవాడు కృష్ణమూర్తే మళ్ళీపుట్టాడని అంతా అనుకున్నారు. ఒక్కళ్ళూ పైకి ఎప్పుడూ అనలా.

సూర్యనారాయణ యొక్క తండ్రి పేరు కృష్ణావధానులు. ఆ పేరే కుర్రవాడికి పెట్టారు.

మీనాక్షికి గాని, సూర్యనారాయణకు గాని తమ కుఱ్ఱవాడంటే అంత శ్రద్ధలేదు. కుర్రవాడు గాలికి ఎగురుతున్నాడు. ఒకరోజున కుర్రవాడు అరుగుమీంచి పడే వాడయినాడు. మీనాక్షి కదలకుండా కూర్చున్నది. అనసూయ తీసుకువచ్చింది.

**అనసూయ** : ఏమమ్మా! పిల్లవాణ్ణి తియ్యలేదు!

**మీనాక్షి** : ఏమో! మనం పట్టుకుంటే బ్రతుకుతాడా! వాడి కాయుర్దాయ ముంటే వాడే బ్రతుకుతాడు.

మీనాక్షి మనస్సు ఒక ఈ విషయములోనే కాదు అన్ని విషయాల్లోనూ ఇప్పుడిట్లాగే ఉంది.

పిల్లవాడికి మూడోయేడు వెళ్ళి నాలుగోయేడు వచ్చింది. పిల్లవాడికి పుట్టినరోజు పండుగ చేద్దామనే లేదు. మీనాక్షికి అనసూయ బలవంతాన తలంటు పోసింది.

వర్షాకాలం వచ్చింది. వానలు నాలుగు రోజులు తియ్యకుండా కురిసినై. బందరులో ఎప్పుడూ ఉప్పెన వస్తుందనే భయమే. రాత్రిళ్ళు సముద్రధ్వని హోరుమని వినబడుతుంది.

కృష్ణావధానులు రెండురోజులు నలతగా ఉన్నాడు. పడిశం పట్టింది. ఒళ్ళు వెచ్చగా వుంది. మీనాక్షి ఊరుకుంది.

**అనసూయ** : పిల్లవాణ్ణి డాక్టరుకు చూపించకుండా ఊరుకుంటారేం?

**మీనాక్షి** : ఏదో కొంచెం పడిశెం పడితే డాక్టరెందుకు?

వేంకటేశ్వరరావు మరునాడు డాక్టరిని తీసుకువచ్చి చూపించాడు. డాక్టరు మందిచ్చి పోయినాడు.

మర్నాడు మీనాక్షికి జ్వరం వచ్చింది. సూర్యనారాయణకి జ్వరము వచ్చింది. వాళ్ళేదో తీసుకు తిరుగుచున్నారు. పిల్లవాణ్ణి అనసూయే చూడవలసి వచ్చింది. కుఱ్రవాడికి ఆ జబ్బు పెద్దదైంది. కఫము చుట్టేసి ఊపిరాడనియ్యలేదు. కుఱ్రవాడు రాత్రికి పోయినాడు.

మీనాక్షి సూర్యనారాయణలు కదలలేక పోయినారు.

పిల్లవాణ్ణి పారవేయిద్దామంటే ఎవ్వరూ కుదరలేదు. చివరకు వెంకటేశ్వరరావుకు తప్పలేదు. మీనాక్షికి గానీ, సూర్యనారాయణకు గానీ అంత దుఃఖం ఉన్నట్టుగా లేదు. పరాయి వాళ్ళ పిల్లవాడు చచ్చిపోతే కొంచెం జాలిపడ్డట్టు పడ్డారు. వీళ్ళు జ్వరంతో ఉంటే పిల్లవాడికి అంతా చేసింది అనసూయ. ఆవిడ పాపం ఏడ్చింది.

వేంకటేశ్వరరావు పిల్లవాణ్ణి తీసుకు వెళుతుంటే మీనాక్షికి ఏడుపు వచ్చింది. సూర్యనారాయణకి ఏడుపు వచ్చింది.

సూర్యనారాయణ కొంచెం ఏడుస్తూ "నాయనా! వాడికి ఋణం తీరింది కాబోలు. మూడు సంవత్సరాలు సరిగ్గానన్నా చూడలేదు" అన్నాడు. ఇంతలో

సూర్యనారాయణ కళ్ళు మెటిసినై. ఏదో భావం వచ్చిందతని మనస్సులోకి. లేచి నిల్చొని ఆవేశంతో "వేంకటేశ్వరరావూ! తీసుకువెళ్ళు నాయనా! నీ చేతులారా పారేసిరా! పిల్లవాణ్ణి గట్టిగా ఎదుర్రొమ్మున అదుముకో. గట్టిగా పట్టుకో జారిపోతాడేమో సుమా! నీ పిల్లవాణ్ని నేను దాచేశానా? ఇదిగో! వాడే వీడు. నీ పిల్లవాణ్ని నీకిచ్చాను. నాయనా! నీయిష్టం నీవు ఏం చేసుకుంటావో! నీ ఋణం తీర్చుకున్నా?" అని ఏమోమో అన్నాడు. వేంకటేశ్వరరావు కుర్రవాణ్ణి నిశ్శబ్దంగా తీసుకువెళ్ళాడు.

సంవత్సరం గడిచింది. మీనాక్షి పదునాలేండ్ల పిల్లవలె ఉంది. ఆవిడకు పోయిన అందం, ఆరోగ్యం మళ్ళీ వచ్చినై.

సూర్యనారాయణ నలభైయైదేళ్ళకే చనిపోయినాడు. అతనికి మళ్ళీ బిడ్డలు కలుగలేదు.